క్లుప్తంగా

25న యాదగిరిగుట్టకు హరీశ్‌రావు రాక

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రానున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. గిరిప్రదక్షిణలో పాల్గొని, మెట్ల మార్గంలో కాలినడకన యాదగిరి కొండపైకి చేరుకుని స్వామివారికి పూజలు చేస్తారని వెల్లడించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్‌ఎస్ బీసీ విభాగం మండలాధ్యక్షుడు కవిడే మహేందర్, మాజీ కౌన్సిలర్ సురేందర్, శ్రీహరి, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరి: పట్టణంలో 11 కేవీ లైన్ ఏబీ స్విచ్ పనులు, ఎత్తు పెంచే పనిలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ సాయికృష్ణ మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పహాడీనగర్, బంజారాహిల్స్, తారాకరామానగర్, ప్రగతినగర్, విద్యానగర్, రాంనగర్, సీతానగర్, న్యూ రాంనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శాశ్వత మడిగెలు నిర్మించి ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : జగదేవ్‌పూర్ రోడ్డులో రహదారి విస్తరణలో కోల్పోతున్న దుకాణాల వారికి కో ఆపరేటివ్ బ్యాంక్ సమీపంలో గల ఖాళీ స్థలంలో శాశ్వత మడిగెలు నిర్మించి ఇవ్వాలని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వారిలో షాదీఖానా చైర్మన్ ఏజాజ్, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ షరీఫ్, మాజీ కౌన్సిలర్ లయిక్ అహ్మద్, మజర్, హిరేకర్ రమేష్ ఉన్నారు.


ఆర్థికసాయం అందజేత


బాధిత కుటుంబానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న గ్రామస్తులు

మోత్కూరు : మండలంలోని రాగిబావి గ్రామంలో రాంపాక మల్లేష్ అనే వ్యక్తి ఇటీవల మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో రాగిబావి గ్రామస్తులు, యువత ముందుకు వచ్చి గ్రామ వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన రూ.34 వేల ఆర్థిక సాయాన్ని ఆయన కుమార్తె అయిన నవ్య పేరు మీద బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈమేరకు బాండ్ పేపర్‌ను మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

బీబీనగర్: మండలంలోని చిన్నరావులపల్లి గ్రామానికి చెందిన బండారి మల్లికార్జున్ అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బొక్క జైపాల్‌రెడ్డి మంగళవారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలచందర్, నగేష్, సతీష్, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

రూ.1.26 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న ఈశ్వర్‌గౌడ్

బొమ్మలరామారం: మండలంలోని పిల్లిగుండ్ల తండాలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి బీజేపీ నాయకుడు కుర్మిండ్ల ఈశ్వర్‌గౌడ్ మంగళవారం రూ.1.26లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను హన్‌మాన్ మాలధారులు ఘనంగా సన్మానించారు.

పాఠశాలకు కుర్చీలు పంపిణీ

ఆలేరురూరల్: మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన చింతకింది గణేష్ చర్లపల్లిలోని ఐకాన్ టిలి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం 150 కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జూకంటి అనురాధనీల్, రాములు, వెంకటేష్, శ్రీనివాస్, రాజు, శ్రావణ్, సంపత్, నవీన్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డుగా మార్చాలి

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల నుంచి సదర్శాపురం గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డును బీటీగా మార్చాలని మంగళవారం సీపీఎం నాయకులు స్థానికంగా నిరసన తెలిపారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, నాయకులు కురుమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, కురుమేటి సోమయ్య, అంజయ్య పాల్గొన్నారు.

గుండాల రోడ్లు గుంతలమయం

మోత్కూరు : గుండాల మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుండాల నుంచి గంగాపురం మీదుగా సూర్యాపేట–జనగామ రోడ్డు వరకు సీతారాంపురం నుంచి వెల్మజాల, మరిపడిగ మీదుగా సూర్యాపేట రోడ్డు వరకు, పాచిల్ల నుంచి బండకొత్తపల్లి మీదుగా కడవెండి సీతారాంపురం వరకు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కంకర తేలి ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి పూట ప్రయాణించే వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


గుంతలమయంగా ఉన్న గుండాల-గంగాపురం రోడ్డు


మరిపడిగ-సీతారాంపురం రోడ్డు


గుండాల-నూనెగూడెం రోడ్డు దుస్థితి

వెల్ఫేర్ బోర్డు ద్వారానే పథకాలు అందించాలి


ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయూ నాయకులు

భువనగిరిటౌన్ : భవన నిర్మాణం వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టే జీఓ నంబర్ 12 ను సవరించి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ కార్యదర్శి కల్లూరి మల్లేశం, భవన నిర్మాణ కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొరిగె సోములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం లాంటి స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ జీఓ నంబర్ 12 ను తీసుకువచ్చిందని దానిని సవరించి ప్రభుత్వమే కార్మిక శాఖ కార్యాలయం ద్వారా సక్రమంగా అమలయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణరంగ కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, గడువు దాటిన 12 లక్షల కార్డులను రెన్యువల్ చేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా, జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, కొంగరి మారయ్య, వంగాల మారయ్య, కలకుంట్ల శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు కూరెళ్ల నరసింహ, తూటి వెంకటేష్, చుక్క రామచంద్ర, ఈర్ల మైసయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశిబిరం


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. క్యాంపు ద్వారా 212 మందికి గర్భాశయ, కంటి, జనరల్ ఫిజీషియన్, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద వైద్య శిబిరాన్ని సందర్శించి, రోగులను అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి శ్రీవాణి, వైద్యనిపుణులు నీతు, ఎతిరాజువల్లి, ఆశ్రుత, సీహెచ్‌ఓలు నర్సింహారెడ్డి, పోతారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, అరుంధతి, శ్రీదేవి పాల్గొన్నారు.

దుర్గాదేవికి వెండి కిరీటం బహూకరణ


దుర్గాదేవికి వెండి కిరీటం బహూకరించిన అనంతరం పూజల్లో పాల్గొన్న దాతలు, భక్తులు

భూదాన్‌పోచంపల్లి: దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి గ్రామంలో దుర్గాకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి మంగళవారం పోచంపల్లికి చెందిన చెక్క బసవరాజు, చంద్రకళ దంపతుల కుమారులు చెక్క భాను, సాయిప్రకాశ్ 80 గ్రాముల వెండి కిరీటాన్ని బహూకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవకమిటీ అధ్యక్షుడు గోదాసు అనిల్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు


రామన్నపేట: బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఐసీడీఎస్ ఉద్యోగులు

రామన్నపేట: రామన్నపేటలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల టీచర్లు, ఆయాలు బతుకమ్మలు పేర్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. సీడీపీఓ వెంకటరమణ, ఏసీడీపీఓ సమీరామీర్జా, సూపర్‌వైజర్లు బాలమణి, ధనమ్మ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో మంగళవారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. స్త్రీశక్తి కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక వీరుల చెరువు వద్ద నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రచ్చ పల్లవి, మండల సమాఖ్య కార్యదర్శి మాధవి, కోశాధికారి కవిత, వీఓఏలు స్వరూప, రజిత, స్వప్న, శ్యామల, భాగ్యలక్ష్మి, సురమాంబ, నిర్మల, జయమ్మ పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం): స్త్రీశక్తి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు

గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

భువనగిరిటౌన్ : జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవైస్ ఉర్ రెహమాన్ చిస్తీ కోరారు. జిల్లాలోని గ్రంథాలయ ఉద్యోగులతో మంగళవారం భువనగిరిలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగుల సమయ పాలన, గ్రంథాలయ సెస్ వసూలు, మెంబర్‌షిప్ డిపాజిట్ తదితర విషయాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పాలన అధికారుల నియామకం

ఆత్మకూరు(ఎం): మండలంలోని క్లస్టర్‌లకు గ్రామ పాలన అధికారులను నియమించినట్లు తహసీల్దార్ లావణ్య మంగళవారం తెలిపారు. ఆత్మకూరు(ఎం) క్లస్టర్‌కు శ్రీనివాస చారి, కప్రాయపల్లి క్లస్టర్‌కు సురారం యాదయ్య, పల్లెర్ల క్లస్టర్‌కు బండెల వీరస్వామి, రాయిపల్లికి ఈదులూరి సత్యనారాయణ, కూరెళ్లకు దాసరి వీరయ్య, రహీంఖాన్‌పేటకు మారబోయిన రాజయ్య, పల్లెపహాడ్ క్లస్టర్‌కు నర్సింహను నియమించినట్లు పేర్కొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆలేరు: గ్రామీణ ప్రాంత కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవీంద్రభారతిలో జరిగే బతుకమ్మ వేడుకల్లో కోలాటం కళాకారులకు, యాదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాల్లో గ్రామీణ కళాకారులకు అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సామాజిక రుగ్మతలపై కళాకారుల ప్రదర్శన

మోత్కూరు : జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మంగళవారం శ్రీ సాయి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సామాజిక రుగ్మతలపై కళా ప్రదర్శన ఇచ్చారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, మహిళల ఆరోగ్య సమస్యలు, రక్త దానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


జగదేవ్‌పూర్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భువనగిరిటౌన్ : భువనగిరిలో నిర్వహించే దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి వివిధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ సందర్భంగా పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ వద్ద లైటింగ్, శానిటేషన్, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. దసర పండుగ రోజులు విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాంతడక, హన్మాన్‌వాడ, అంజనాద్రి ఆలయం, సాయిబాబా గుడి, హుసేనాబాద్‌తో పాటు, వివిధ ఏరియాలో దసర ఉత్సవాలు జరుగుతాయని, ఈమేరకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. అనంతరం భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ కమిషనర్ రామలింగం, మున్సిపల్ డీఈ కొండల్ రావు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు

భువనగిరి: కాంగ్రెస్ పార్టీ నాయకులు జీఎస్టీపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణలకు కాంగ్రెస్ నాయకులు ఆయోమయంలో పడి ఏం మాట్లాడుతున్నారో వారికే అర్థం కావటం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు లోటు రాకుండా 100 శాతం లోటును కేంద్ర ప్రభుత్వమే భరించిందని తెలిపారు. జీఎస్టీ స్లాబ్స్‌లో 5, 12, 18, 28 నుంచి 5, 18 శాతానికి తగ్గించడంతో కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్ల ఆదాయం కోల్పోతుందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు.

తాగునీరు వచ్చేసింది

సాక్షి ఎఫెక్ట్..

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని భీమనపల్లి గ్రామంలో ప్రజల తాగునీటి కష్టాలు తొలిగాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్‌ఫిల్టర్ చెడిపోయి వారం రోజులుగా తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో 'భీమనపల్లిలో తాగునీటికి తిప్పలు' అనే శీర్షికన మంగళవారం కథనం ప్రచురించింది. ఈమేరకు అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సుమలత చొరవ తీసుకొని మరమ్మతులు చేయించి వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో మంతపురి వాసికి చోటు

ఆలేరురూరల్: ఆలేరు మండలం మంతపురి గ్రామానికి చెందిన బండారి ప్రసాద్‌కు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది. ఈమేరకు హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్‌లో యువజన, క్రీడలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా మంగళవారం అవార్డు అందుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే నిరుపేద యువకుల కోసం ఉచితంగా మెటీరియల్, ఉచిత శిక్షణ కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నందుకు గాను బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్ : బీఎస్‌ఎన్‌ఎల్ అందిస్తున్న సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని బీఎస్‌ఎన్‌ఎల్ ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వెంకటేశం కోరారు. మంగళవారం చౌటుప్పల్‌లో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేవలం రూ.299కే ల్యాండ్ ఫోన్‌తోపాటు ఇంటర్నెట్, టీవీ చానెళ్లు అందిస్తామని తెలిపారు.

టీపీసీసీ సోషల్‌మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా బాలశంకర్

భూదాన్‌పోచంపల్లి: టీపీసీసీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా పోచంపల్లి పట్టణ కేంద్రానికి గుత్తి బాలశంకర్ నియామకమయ్యారు. ఈమేరకు మంగళవారం టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న జహంగీర్

వలిగొండ : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సీపీఎం మండల స్థాయి శిక్షణ తరగతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులతో సంప్రదించకుండా, గ్రామసభలు నిర్వహించకుండా భూసేకరణ ఎలా చేపడతారని ప్రశ్నించారు. కేవలం కొద్దిమంది ప్రయోజనాలకోసం అలైన్‌మెంట్ మార్పుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. సమావేశంలో కవిడే సురేష్, మాటూరి బాలరాజు, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, ఈర్లపల్లి ముత్యాలు, మెరుగు వెంకటేశం, తుర్కపల్లి సురేందర్, కూర శ్రీనివాస్, వాకిటి వెంకటరెడ్డి, కొమ్మిడి సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా గీతన్నల రాతలు మారడం లేదు


మాట్లాడుతున్న జయరాములుగౌడ్

యాదగిరిగుట్ట రూరల్: కల్లు గీత వృత్తి చేస్తూ సహజ మరణం పొందిన గీత కార్మికుడి కుటుంబానికి రూ.5లక్షల ఆర్థికసాయం ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములుగౌడ్ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం నిర్వహించిన కల్లు గీత కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా గీతన్నల తల రాతలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు రాగీర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందించాలన్నారు. గీత కార్మికులకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయాలన్నారు. మహాసభలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దూపటి వెంకటేష్, ఎరుకల హేమేందర్ గౌడ్, మారగోని శ్రీరామ్మూర్తి గౌడ్, జిల్లా నాయకులు గంధమల్ల ఉపేందర్ గౌడ్, సీస కృష్ణ గౌడ్, గొట్టిపర్తి బాలరాజు గౌడ్, సంఘం నాయకులు మిట్ట వెంకటయ్య గౌడ్, సుదగాని శ్రీనివాస్ గౌడ్, బత్తిని ముత్యాలు గౌడ్, కారింగుల కృష్ణయ్య గౌడ్, కోల వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

కోతకు గురైన మర్యాల రోడ్డు


తెగిపోయిన మర్యాల-భువనగిరి రోడ్డు

బొమ్మలరామారం : మండలంలో కురిసిన వర్షానికి మర్యాల గ్రామంలో ఈదుల్ల చెరువు నిండింది. ఈ చెరువు ద్వారా వచ్చిన వరద నీటితో మండలంలోని మర్యాల–భువనగిరి రోడ్డు కోతకు గురైంది. మర్యాల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణం కోసం చేపట్టిన ప్రాంతంలో కుంటగా మారింది. దీంతో మర్యాల గ్రామానికి భువనగిరి వైపు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.


లోలెవల్ బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న మూసీ

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

వలిగొండ : ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వలిగొండ మండలంలోని సంగెం భీమలింగం వద్ద గల మూసీ లోలెవల్ వంతెన పై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. అధికారులు వాహనాల రాకపోకలు నిలిపివేశారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని చొల్లేరు–మల్లిగూడెం గ్రామాల మధ్య ఉన్న లో లెవల్ వంతెనపై వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఇరువైపులా బారికేడ్లు వేసి రాకపోకలను నిలిపివేశారు.

ధనోజకు తెలంగాణ ఐకాన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ధనోజ

రామన్నపేట: రామన్నపేటకు చెందిన కర్లిం ధనోజకు వసుంధర వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ వారు జాతీయ కళారత్న తెలంగాణ ఐకాన్ అవార్డు ప్రదానం చేశారు. సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణభాష సాంస్కృతిక శాఖ సంచాలకుడు కవి, విమర్శకుడు ఏనుగు నర్సింహారెడ్డి చేతుల మీదుగా ధనోజ అవార్డు అందుకున్నారు. ఆమె రావి ఆకులపై చిత్రాలను వేయడం ద్వారా ప్రాచుర్యం పొందారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీగాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


రామన్నపేట: పూజలో పాల్గొన్న మాలధారులు


చౌటుప్పల్ : దుర్గాదేవి పూజల్లో పాల్గొన్న భక్తులు


బీబీనగర్: దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు


మోత్కూరు : పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు